ముందుకు వెళ్లలేం.. వెనక్కీ రాలేం!

- రైల్వే గేట్ల వద్ద స్తంభిస్తున్న ట్రాఫిక్
- నేటికీ నోచుకోని అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం
- రూ.1.83 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినా పట్టించుకోని రైల్వే అధికారులు
- ప్రజలకు తప్పని తిప్పలు


పట్టణ నడిబొడ్డున ఉన్న నంద్యాల, కర్నూలు రైల్వేగేట్లు


కర్నూలు గేటు పడుతున్నా వెళ్తున్న జనం (ఫైల్)

డోన్: రైల్వే గేటు పడితే ప్రజల అవస్థలు తప్పడం లేదు. పక్కపక్కనున్న రెండుగేట్లు ఎప్పుడైనా ఒకటి తర్వాత మరొకటి పడిందనుకో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అటు... ఇటు వైపులా వాహనాలు బారులు తీరింటాయి. ముందుకు వెళ్లలేం... వెనక్కీ రాలేం అన్నట్లుగా ఉంటుంది పరిస్థితి. లక్షకు పైగా జనాభా ఉన్న డోన్ పట్టణం నడిబొడ్డున సికింద్రాబాదు – గుంతకల్, గుంటూరు – గుంతకల్ వైపు వెళ్లే రెండు ప్రధాన రైలు మార్గాలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. రెండు రైల్వే గేట్ల మధ్యనే పాతపేట, రైల్వేస్టేషన్, రైల్వే కాలనీలు ఉన్నాయి. రెండు రైల్వేగేట్ల మధ్య ఉన పాతపేటలో ప్రధాన దేవాలయాలతో పాటు ప్రభుత్వాసుపత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. గేట్లు మూసినప్పుడు పరిస్థితి దారణంగా ఉంటుంది. ఈ గేట్లతోపాటు శ్రీరాముల దేవాలయం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని పట్టణ ప్రజలు ఏళ్లతరబడి కోరుతూనే ఉన్నారు. పదేళ్ల క్రితం అప్పటి రైల్వే శాఖ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రయత్నాలు చేసినా ఫలితం కలుగలేదు. శ్రీరాముల దేవాలయం వద్ద గల రైల్వేగేట్ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపివేశారు. అయినా పాలకులు పట్టించుకోకపోవడంతో నేటికీ ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అయితే అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపుతున్నా రైల్వే ఉన్నతాధికారుల స్పందన కరువైంది.

మంత్రి బుగ్గన చొరవ చూపినా...

డోన్ ప్రజల ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. కేంద్రానికి సరికొత్త ప్రతిపాదనలు పంపారు. దీంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రెండు అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించేందుకు 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని షరత్తు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌డీ శాఖ ద్వారా సగం నిధులు రైల్వే శాఖకు చెల్లించేందుకు అంగీకార పత్రాలు పంపింది. రైల్వేశాఖ నుంచి ఇందుకు సంబంధించిన సమాధానం రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకా అందాల్సి ఉంది. రైల్వే ఉన్నతాధికారుల తీరును పట్టణ ప్రజలు తప్పుపడుతున్నారు.

చాలా సమయం వృథా అవుతుంది



అత్యవసర పనుల నిమిత్తం పట్టణంలో ఒకవైపు నుంచి మరొవైపునకు వెళ్లాలంటే రైల్వేగేట్ల మూలంగా సమయం వృథా అవుతుంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చే వారు సకాలంలో వైద్యం అందక మార్గమధ్యలోనే మృతి చెందిన సంఘటనలు లేకపోలేదు. ఈ రెండుచోట్ల వద్ద అండర్ పాస్ నిర్మిస్తే కష్టాలు కడతేరతాయి.

– సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్, కొత్తకోట

మరో ఏడాదిలో అండర్‌పాస్‌ల నిర్మాణం



ఒక్కొక్క బ్రిడ్జి నిర్మాణానికి రూ.6కోట్లు ఖర్చవుతుందని కేంద్ర రైల్వేశాఖ అంచనా వేసింది. దీంతో రూ.3కోట్లను రాష్ట్రం వాటాగా చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అండర్‌పాస్ నిర్మించే ప్రాంతాల్లో భూసేకరణ కోసం రూ.1.83కోట్లను ఆర్‌అండ్‌బీ ద్వారా చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపింది. మంత్రి బుగ్గన కృషితో ఈ ఏడాది ఆఖరునాటికి బ్రిడ్జి నిర్మాణం పనులకు ఆటంకాలు తొలిగిపోతాయని భావిస్తున్నాం.

– సప్తశైల రాజేష్, మున్సిపల్ చైర్మన్, డోన్

క్లుప్తంగా

పెద్దమ్మ గుడి అభివృద్ధి విరాళం


నగదు అందజేస్తున్న నెమలి లక్ష్మీదేవి

బనగానపల్లెరూరల్ : మండలంలోని టంగుటూరులో కొలువైన శ్రీ పెద్దమ్మ గుడి అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన దివంగత నెమలి నారప్పరెడ్డి కుమారులు డాక్టర్ నెమలి రవికుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి రూ.50,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం దాతల తల్లి నెమలి లక్ష్మీదేవి విరాళం నగదు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డికి అందజేశారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలోని వెంకటరమణ కాలనీలో అష్టలక్ష్మి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, జపాదులు, వేదపఠనం, యంత్రాలకు అభిషేకం, మహా మంగళహారతి, అరుణ, దత్త, సుబ్రహ్మణ్య హోమాలు జరిగాయి. సాయంత్రం ప్రదోషపూజ, జలాధివాసం, తీర్థప్రసాదవినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు మైలవరపు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామాయణ ప్రవచన సుధాకర కార్యక్రమం భక్తులను అలరించింది.

సభ్యత్వ నమోదు

బేతంచెర్ల: పట్టణంలో సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా సహ కన్వీనర్ నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు, హిజ్రాలు సైతంఫౌండేషన్ సభ్యత్వాన్ని స్వీకరించారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు


పెట్రోల్‌బంకు సర్కిల్‌లో ఆక్రమణలు తొలగించుకుంటున్న దృశ్యం

బనగానపల్లె: పట్టణంలో ఫోర్‌లైన్స్ ఏర్పాటుతో పెట్రోల్‌బంకు కూడలిలోని తమ కట్టడాలను యజమాన్యాలు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయా దుకాణాల యాజమాన్యాలను పిలిపించి పోర్ లైన్ అభివృద్ధి పనులకు సహకరించాలని, ఆక్రమణలను తొలగించుకోవాలని గతంలోనే సూచించారు. ఎమ్మెల్యే సూచన మేరకు రోడ్డులోని కట్టడాలను వారు తొలింపు పనులు చేపట్టారు. దీంతో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్న ఆయా దుకాణాల యాజమాన్యాలను దీంతో ఎమ్మెల్యే కాటసానితో పాటు పట్టణ ప్రజలు అభినందించారు.

భగవంతుని నామస్మరణతో మానసిక ప్రశాంతత


విష్ణు పారాయణం చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: భగవంతుని నామస్మరణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పూదోట ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణ, ఏవీ నరసింహులు, నాగమోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో సంజామల మండలం పేరుసోమల శ్రీ చెన్న కేశవస్వామి విష్ణు సహస్రనామ మండలి, బేతంచెర్ల పట్టణ పూదోట భక్త మండలి ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ పారాయణం వలన మానసిక ప్రశాంతతో పాటు భక్తి మార్గం అలవర్చుకొని భగవంతుని అనుగ్రహం పొందుతారని వారు తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని బిజనవేముల, వెలగటూరు, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల, రేవనూరు, ఉప్పలపాడు, కలుగొట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 13న జరిగే ఎన్నికల్లో రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డీవీ శేషిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మల్లు హరినాథరెడ్డి, రాచంరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం


బేతంచెర్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

బేతంచెర్ల: రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించడంపై బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక వైస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, బీసీ నాయకులు గూని నాగరాజు, వెంకటేశ్వర్లు, రంగస్వామి తదితరులు మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు సీఎం పెద్ద పీట వేశారన్నారు. 2024 ఎన్నికల్లో బీసీలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కృష్ణమూర్తి, మద్దయ్య, నాగరాజు, పెద్దయ్య, కిరణ్, రంగస్వామి, హరి, ఎస్సీ, మైనార్టీ నాయకులు యకోబ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రెడ్డి

కోవెలకుంట్ల: హిందూ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సమరత సేవా పౌండేషన్ రాయలసీమ జోనల్ ధర్మప్రచారకర్త ఈశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ కల్యాణ మండపంలో ఆ సంస్థ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం విశిష్టతను ప్రతి గడపకు తెలియజేయాలన్నారు. సమరత సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 15 దేవాలయాలను నిర్మించామన్నారు. ప్రతి ఏటా వెయ్యి మంది భక్తులకు ఉచితంగా తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం కల్పిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పౌండేషన్ జిల్లా ధర్మ ప్రచార కర్త శ్రీనివాసులు, కన్వీనర్ మాధవరెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రనాథరెడ్డి, గార్లపాటి జగదీశ్వరరెడ్డి, రత్నమ్మ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న చల్లా శ్రీలక్ష్మి

కోవెలకుంట్ల: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి సతీమణి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి సూచించారు. ఆదివారం స్థానిక వికాస్ హైస్కూల్‌లో అండర్–17 విభాగంలో జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగాపల్లె మండలాల్లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 223 మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వినోద్, హెచ్‌ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి


కేఎస్ జవహర్‌రెడ్డికి స్వామివార్ల జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్ లవన్న , అర్చక వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, చైర్మన్, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

నేడు పట్టుబడిన వాహనాల వేలం

కోవెలకుంట్ల: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ. 3వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్, పాన్‌కార్డులతో వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలి

బనగానపల్లెరూరల్: వైఎస్సార్‌సీపీ, పీఆర్‌టీయూ బలపరచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం పీఆర్‌టీయు, ఆపుస్మా సంఘం నాయకులు బనగానపల్లె పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఆర్‌టీ యు సంఘంతో పాటు మొత్తం 36 సంఘాలు ఎంవీ రామచంద్రారెడ్డిని బలపరుస్తున్నాయన్నారు. ప్రచార కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు బాలమద్దిలేటి, ప్రధాన కార్యదర్శి దస్తగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంపుల్లారెడ్డి, ఆపుస్మా నాయకులు సికిందర్, బేగ్, కమల్‌తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త హంగులతో ప్రభుత్వ భవనాలు

రూ. 53 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



రూ. 40 లక్షలతో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం



రూ. 11 లక్షలతో నిర్మించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయ భవనం



కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తుండటంతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుంది. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో రూ. 1.04 కోట్లతో అన్ని హంగులతో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల నాణ్యత పరీక్షలు చేసేందుకు రూ. 53 లక్షలతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో రూ. 40 లక్షలతో పట్టణ శివారులో అన్ని వసతులతో కొత్త భవనం నిర్మించారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వం రూ. 7 లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు చాలక పోవడంతో భవన నిర్మాణాన్ని మధ్యలో వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదనంగా రూ. 4 లక్షల నిధులు కేటాయించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

మంత్రిని విమర్శించే అర్హత సుబ్బారెడ్డికి లేదు!

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- టీడీపీ నాయకులకు సవాల్ విసిరిన వైఎస్సార్‌సీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిపై విమర్శించే అర్హత డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, నాయకులు గూని నాగరాజు, యకోబ్ మాట్లాడారు. 90 శాతం ఓటింగ్ ఉన్న బీసీ వ్యక్తితో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా నామినేషన్ వేయిస్తే 10 శాతం ఓటింగ్ లేని వ్యక్తితో టీడీపీ నాయకులు నామినేషన్ వేయించారన్నారు. విషయం అర్థమై ఇక్కడ ఉన్న బీసీ, ఎస్సీ కౌన్సిలర్స్ స్వచ్ఛందంగా విత్ డ్రా చేసుకున్నారే తప్పా తాము ఎవ్వరినీ భయభ్రాంతులకు గురి చేయలేదన్నారు. డోన్ నియోజకవర్గంలో రెండు పెద్ద కుటుంబాల 40 సంవత్సరాలుగా చేసిందేమీ లేదని, కేవలం మూడున్నరేళ్లలో మంత్రి బుగ్గన సారథ్యంలో రూ. 2,800 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఏ పల్లెకు వెళ్లినా రహదారులు, గుడి, బడులకు రూ. కోట్లు వెచ్చిస్తూ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. నేషనల్ హైవేతోపాటు రూ. 330 కోట్లతో 135 గ్రామాలకు తాగునీటి పైపు లైను నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. కొన్ని రోజులుగా మంత్రి బుగ్గన ఏమి అభివృద్ధి చేయడం లేదని టీడీపీ నాయులు పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. దీంతో ఈనెల 24న అభివృద్ధిపై మాట్లాడుదామనే పార్టీ శ్రేణులతో కలిసి టీడీపీ కార్యాలయం దగ్గరకు వచ్చామేతప్పా... గొడవపడటానికి కాదన్నారు. మేము వస్తున్నామని వెళ్లిపోయిన నాయకులు టీడీపీ ఆఫీస్ గేట్ విరగ్గొట్టామని ఆరోపించడం భావ్యం కాదన్నారు. సర్పంచ్‌గా కూడా గెలువని ధర్మవరం సుబ్బారెడ్డి, ఏళ్లతరబడి గొర్రెల పెంపకం దారుల సంఘం చైర్మన్ పీఠం వీడని నాగేశ్వరావు యాదవ్, ఇష్టానుసారంగా పార్టీలు మార్చే వలసల రామకృష్ణ తదితరులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకుంటే బీసీలే తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. దమ్ముంటే మంత్రి బుగ్గన చేపట్టిన అభివృద్ధిపై చర్చకు రావాలని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ వెంకటేశ్వర్లు, రంగస్వామి, దస్తగిరి, ఖాజా, ఎద్దులన్న, నాగేశ్వరరావు, కిరణ్, క్రిష్ణమూర్తి, హరి,నిరంజన్, భరణి, మద్దయ్య,గోరుమానుకొండ, గూటుపల్లె సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాడి రైతులకు పాల బోనస్ పంపిణీ

బనగానపల్లెరూరల్: విజయ డెయిరీ బనగానపల్లె యూనిట్, బేతంచర్ల మండలంలోని శంకారాపురం యూనిట్ పరిధిలోని పాడి రైతులకు బోనస్ మొత్తం రూ.2,84,192 పంపిణీ చేసినట్లు ఆ యూనిట్ల మేనేజర్ మధుసూదన్‌బాబు ఆదివారం తెలిపారు. బనగానపల్లె యూనిట్ పరిధిలోని పండ్లాపురం గ్రామానికి సంబంధించిన పాడిరైతులకు రూ.21,500, భానుముక్కల సెంటర్‌కు రూ.32,500 అందజేశామన్నారు. అదేవిధంగా శంకారాపురం యూనిట్ పరిధిలోని బైనపల్లి సెంటర్–1లో రూ.53,600, సెంటర్–2లో రూ.91, 576, సీతారామపురం సెంటర్‌లో రూ. 26, 715, శంకారాపురం సెంటర్‌లో రూ. 40, 210, రుద్రవరం సెంటర్ రూ.15, 030, ఎం బాయి సెంటర్‌లో రూ.3,061 చొప్పున పాడిరైతులకు పంపిణీ చేశామని వివరించారు. కార్యక్రమంలో రైతులు కుమార్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లికార్జునప్ప, మల్లేశ్వరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు మౌలిక వసతులు


కొలిమిగుండ్ల లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలు


తుమ్మల పెంట లేఅవుట్ వద్ద విశాలమైన రోడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం


కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరబోతుంది. జగనన్న కాలనీల రూపంలో కొత్త గ్రామాలుగా ఏర్పాటు కాబోతున్నాయి. ఉగాది నాటికి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. దీంతో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి. జగనన్న కాలనీల్లో గృహాలకు అనుగుణంగా విశాలమైన రోడ్లు నిర్మించారు. కొలిమిగుండ్ల, తుమ్మలపెంట జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు అమర్చి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా తాగునీటి కోసం బోర్లు వేసి మోటార్లతోపాటు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడంతో గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. కొలిమిగుండ్లలో 120, తుమ్మలపెంటలో 80 చొప్పున ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల కంటే ముందుగానే రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.